భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

చేర్యాల: చేర్యాల శంఖుచక్రధారి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చేర్యాల, జూన్ 1 : చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాల్లో వేద పండితులు, పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుపురు భక్తులు అన్నదానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వివిధ గ్రామాల్లో...

మద్దూరు(ధూళిమిట్ట), జూన్1: మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో హన్‌మాన్ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మదూద్దూరు ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు పానుగంటి తిరుపతయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు వివిధ పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

గజ్వేల్: గజ్వేల్‌లో అభిషేకంలో పాల్గొన్న భక్తులు

వర్గల్‌లో...

వర్గల్, జూన్1: వర్గల్‌లోని బాలాంజనేయ స్వామి దేవాలయంతోపాటు దండుగడ్డ, సీతారాంపల్లి, గౌరారం, వేలూర్, మీనాజీపేట, తున్కిఖల్సా చౌదర్‌పల్లి, సింగాయిపల్లి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా హనుమాన్ జయంతి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 1: హుస్నాబాద్‌లోని పాటిమీద హనుమాన్, గోదాంగడ్డ, శివాజినగర్ తదితర హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, మహిళల పారాయణాలు, పూజ లు, అభిషేకాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులతోపాటు పలువురు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, జూన్ 1: పట్టణంలోని పాండవుల చెరువుకట్టపై ఉన్న హనుమాన్ దేవాలయం, కేసరి హనుమాన్ దేవాలయం, అంగడిపేట హనుమాన్ దేవాలయాల్లో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పాండవుల చెరువుకట్టపై స్వామివారిని ప్రత్యేకంగా పండ్లతో అలంకరించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ చైర్మన్ భాస్కర్, పట్టణవాసులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజు హనుమాన్ జయంతి సందర్భంగా పుచ్చకాయపై హనుమాన్ బొమ్మను చిత్రించాడు.

మిరుదొడ్డిలో...

మిరుదొడ్డి, జూన్ 1: మండలంలోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి పురస్కరించుకొని శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మిరుదొడ్డి టౌన్‌లో పురోహితుడు రాజ పున్నయ్య ఆంజనేయ స్వామి విగ్రహానికి చందనం, తమల పాకుల అర్చన నిర్వహించారు. గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

బెజ్జంకిలో...

బెజ్జంకి, జూన్ 1: మండల కేంద్రంతో పాటు గాగిల్లాపూర్‌లోని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతిని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి పంచామృత అభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బెజ్జంకిలో అన్నదానం చేశారు.

రాయపోల్‌లో...

రాయపోల్, జూన్ 1: దౌల్తాబాద్ మండలం శ్రీసీతారంపల్లిలో హన్‌మాన్ జయంతిని జరుపుకొన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు గిరిశేరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. హన్‌మాన్ స్వాములకు అన్నదానం చేశారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం పోరాటం

చేర్యాలలో మాట్లాడుతున్న డివిజన్ సాధన నాయకులు

చేర్యాల, జూన్ 1 : చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసే వరకు జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని జేఏసీ, అఖిలపక్ష నాయకులు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో శనివారం చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ప్రత్యేక సమావేశం మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెనుకబడ్డ చేర్యాల ప్రాంతాన్ని అన్ని విధాలుగా రక్షించుకునేందుకు పార్టీలకతీతంగా ఉద్యమాలు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.డివిజన్ కేంద్రం సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు అన్ని వర్గాలు మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అండె బీరన్న, సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, టీడీపీ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణరెడ్డి, జేఏసీ నాయకులు బిజ్జ రాము, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మన్నే సత్యవర్ధన్, బీఎస్పీ అధ్యక్షుడు ముస్త్యాల రాజేశ్, సీపీఎం పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు ముస్త్యాల ప్రభాకర్, ఎర్రోబోసు అశోక్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఉద్యమం తీవ్రతరం

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైనదని చేర్యాల రెవెన్యూ డివిజన్ జాక్ చైర్మన్ బైరవభట్ల చక్రధర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, నాయకులు తమ అభిప్రాయాలు పక్కనపెట్టి రెవెన్యూ డివిజన్ కోసం ముందుకు రావాలన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు

క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులు

చేర్యాల, జూన్ 1 : మండలంలోని నాగపురి జడ్పీహెచ్ఎస్‌లో 'ఆరోగ్యం కోసం-ఆటల వైపు' అనే నినాదంతో ప్రారంభించిన ఉచిత రెసిడెన్షియల్ హ్యాండ్ బాల్ సమ్మర్ క్యాంపు ముగిసింది. ఏప్రిల్ 24 నుంచి మే 8 వరకు 15 రోజులు క్యాంపు కొనసాగింది.అనంతరం జిల్లా యువజన క్రీడల శాఖ సిద్దిపేట ఆధ్వర్యంలో నాగపురి పాఠశాలలో మే 1 నుంచి 31వ వరకు వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరం కొనసాగింది. శిబిరంలో వివిధ తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, హెచ్ఎం ఐలయ్య, ఏపీఎం చైర్‌పర్సన్ కేతోజు మాధవి, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, లక్ష్మణ్, శ్రీశైలం, నిరుపమా, మనోజ్‌కుమార్, వేణుగోపాల్, మాధవి, సునీతభాయ్, శ్రీనివాస్, విశాల్, ఉమర్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్1: బడీడు పిల్లలను తల్లిదండ్రులు విధిగా బడిలో చేర్పించాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. శనివారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వతేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి చదువు ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వరదరాజులు, ఎంపీవో ఖాజా మొహినుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, ఏపీఎం బాబురావు, సీసీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

బెజ్జంకి, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నిర్మల, ఎంపీడీవో లక్ష్మప్ప కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమం నిర్వహణపై అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎంఈవో పావని, ఎంఎన్‌వో మహతిలక్ష్మి, ఎంపీవో విష్ణు, ఏపీఎం నర్సయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, క్లస్టర్ హెచ్ఎం శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్1: చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు చేర్యాల ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొంతమంది అక్రమంగా ఇసుక నిల్వ చేశారనే సమాచారం మేరకు మద్దూరు ఏఎస్సై జగదీశ్వర్‌తో కలిసి ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆకునూరు గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని చేర్యాల తహసీల్ కార్యాలయంలో ఉంచామని తెలిపారు. జాలపల్లి, ఖాతా గ్రామాలకు చెందిన ముగ్గురు ట్రాక్టర్ యజమానులకు రూ. 25వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఆకునూరులో కొనసాగుతున్న హ్యాండ్‌వాష్ పనులను పరిశీలిస్తున్న డీఈవో

చేర్యాల, జూన్ 1: మండలంలోని ఆకునూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జున పట్ల, ఆకునూరు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో తాగునీరు, మైనర్, మేజర్ వర్క్స్, టాయిలెట్స్, హ్యాండ్‌వాష్ పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేస్తున్న యూనిఫామ్స్‌ను పరిశీలించారు. ఆయనతో హెచ్ఎం ఐలయ్య, చేర్యాల ఎంఈవో పి.శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ కనకరాజు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ఉన్నారు.

కాళీమాతకు లక్షపుష్పార్చన

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 1: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ కాళీమాత ఆశ్రమంలో జరుగుతున్న వార్షికోత్సవంలో భాగంగా శనివారం కాళీమాతకు లక్ష పుష్పాలతో అర్చన చేశారు. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, సర్వదేవతపూజ, కాళీమాతకు అభిషేకం, మహారుద్ర చండీయాగం, పరమయోగిని కాళీమాతకు పాద పూజ నిర్వహించారు. వార్షికోత్సవానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు.

చికెన్ వండలేదని ఆత్మహత్య

బెజ్జంకి, జూన్ 1: భార్య చికెన్ వండలేదని భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో జరిగింది. అదిలాబాద్ జిల్లాకు చెందిన దశరథ్(40) కుటుంబ సభ్యులతో కలిసి బెజ్జంకి మండలం పోతారం శివారులోని ఓ ఫౌల్ట్రీఫాంలో పని చేస్తున్నాడు. దశరథ్ అనారోగ్యానికి గురికాగా గురువారం దవాఖానకు తీసుకువెళ్లారు. ఇంటికి వచ్చిన తర్వాత చికెన్ వండాలని భార్యను కోరగా డాక్టర్ వద్దు అని చెప్పాడని వారించడంతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడి భార్య సంగోలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యోగా న్యాయమూర్తులుగా సిద్దిపేట సాధకులు ఎంపిక

ఎంపికైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న రాష్ట్ర యోగాసనా అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట, జూన్ 1: సిద్దిపేటకు చెందిన యోగా సాధకులు రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్షల్లో న్యాయమూర్తులుగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నాలుగు రోజులు మౌఖిక, లిఖిత, చర్చ మొదలగు విధానాల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాకు చెందిన మంజులారెడ్డి, కృష్ణ ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ టెక్నికల్ జాయింట్ సెక్రటరీ తోట సతీశ్, సహాయ కార్యదర్శి రాంరెడ్డి, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అఖండ హనుమాన్ చాలీసా

ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

సిద్దిపేట అర్బన్, జూన్ 1 : సిద్దిపేట పట్టణంలోని గణేశ్‌నగర్‌లో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఏడు రోజుల పాటు అత్యంత వైభవంగా విశ్వశాంతి, లోక కల్యాణార్థం జరిగిన అఖండ హనుమాన్ చాలీసా సప్తాహం సమాప్తం అయ్యింది. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ట్రస్ట్ నిర్వహణలో అర్చకుడు చిలకమర్రి వెంకటరమణాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం శనివారం ముగిసింది.

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి సందర్భంగా గణేశ్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ జరిగాయి. హనుమాన్ చాలీసా హవనం, పూర్ణాహుతి జరిగాయని అర్చకుడు రమణాచార్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మానవీయ సంబంధాలు పెంపొందించుకోవాలి

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రషీదా

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 1: సమాజంలో మానవీయ సంబంధాలు పెంపొందించుకుంటూ, జీవిత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది, అభయ సృజన మహిళా స్వచ్ఛంద సంస్థ గౌరవ సలహాదారురాలు రషీదా పిలుపునిచ్చారు. శనివారం కొండపాక కొండపాక మండల కేంద్రంలోని సత్యసాయి ప్రశాంతి నికేతనం మహిళా కళాశాల ఆరో వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీత, నృత్య మందిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సద్గురు శ్రీ మధుసూదనసాయి ఆశీస్సులతో మొట్ట మొదటి మహిళా కళాశాలను కొండపాకలోనే ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్‌తో మొదలైన ఈ కళాశాల యూనివర్సిటీ వరకు విస్తరించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆనంద నిలయం వృద్ధాశ్రమం, ఆనాథ ఆశ్రమం ఇన్‌చార్జి అరుణాదేవి, సీఎస్ఆర్ ఇన్‌చార్జి రాధికాశ్రీధర్, కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమాశంకర్, కార్యదర్శి శంకర్, అకాడమిక్ కో ఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్‌పర్సన్ రేష్మకుందన్, జయశ్రీ, మానస, ఇంటర్ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు, పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ అండ

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేస్తున్న ఎంపీటీసీ కవిత

జగదేవ్‌పూర్ జూన్1: మండల కేంద్రానికి చెందిన డప్పు కనకయ్య కుటుంబానికి అండగా ఉంటామని జగదేవ్‌పూర్ ఎంపీటీసీ, మండల మహిళా అధ్యక్షురాలు కొత్తకవిత అన్నారు. ఇటీవల డప్పు కనకయ్య మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆమె స్థానిక నాయకులతో కలిసి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్, మల్లేశం, రిప్రసన్నరెడ్డి, కరుణాకర్, రామారావు, నర్సయ్య, అరుణ్ పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలి

చాట్లపల్లి పాఠశాలను సందర్శించిన డీఆర్డీఏ పీడీ జయ్‌దేవ్ తదితరులు

జగదేవ్‌పూర్, జూన్ 1: పాఠశాలలు పునఃప్రారంభం రోజు వరకు విద్యార్థులకు ఇవ్వాల్సిన ఏకరూప దుస్తులు సిద్ధం చేసి అందించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ జయదేవ్, ఏపీపీసీ జిల్లా కోఆర్డినేటర్ రామస్వామి సూచించారు. శనివారం మండలంలోని పలుగుగడ్డ, చాట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాసవర్మతో కలిసి ప్రభుత్వ పాఠశాలలు, ఏకరూప దుస్తుల కుట్టు శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం ఆనంద్, పంచాయతీకార్యదర్శులు, ఏపీపీసీ చైర్మన్లు, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్, జూన్ 1: సమన్వయంతో పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పనిచేసి త్వరలో జరుగబోయే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన పోలీసు అధికారులు, కోర్టు అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 8న జరగబోయే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏపీపీలు రవికిరణ్, నాగరాజు, కోర్టు పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, మద్దూరు మండలాల సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

సిద్దిపేట టౌన్, జూన్ 1: రాజీయే రాజమార్గం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి సూచించారు. జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని న్యాయవాదులు, పోలీస్ అధికారులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జడ్జిలు మిలింద్ కాంబ్లే, చందన, శ్రావణియాదవ్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి,పీపీలు వెంకటలింగం, రాధాకృష్ణ, సుప్రియ,సుమన్ జైశ్వాల్, రూప, సిద్దిపేట ఏసీపీ మధు,సీఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

చేర్యాల, జూన్ 1: మండలంలోని ముస్త్యాల పీహెచ్‌సీని శనివారం జిల్లా వైద్యాధికారి పుట్ట శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న జాతీయ,రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, ఆరోగ్య మహిళా క్లినిక్ రికార్డులను ఆయన పరిశీలించారు.అనంతరం జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని, క్షయ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సకాలంలో చికిత్స అందించాలన్నారు. పొగాకు ఉత్పత్తులను వాడడం వల్ల ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యల పై అవగాహన కల్పించాలన్నారు. సందర్శనలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.శ్రీనివాస్, వైద్యాధికారి మైమున, ఏవో రవీందర్‌రెడ్డి, డానియల్ సీసీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదు

మాట్లాడుతున్న జహంగీర్, అంజిరెడ్డి తదితరులు

ములుగు, జూన్ 1: పోరాడి స్వరాష్ట్రకలను నిజం చేసిన తెలంగాణ రాష్ట్ర సాధకుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని ఆపార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం ములుగులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మళి దశ ఉద్యమానికి ఊపిరి పోసి పోరాడి సాధించిన తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధిలో నిలిపిన ఘనత కేసీఆర్ సొంతమన్నారు. కేసీఆర్‌ను విమర్శించే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొన్యాల బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గణేశ్‌గుప్తా, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, భూపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడిని హత్య చేసిన నిందితుల రిమాండ్

గజ్వేల్, జూన్ 1: మూడు రోజుల క్రితం మండలంలోని అహ్మదీపూర్‌లో మధోజీ నరేశ్(28)ని హత్య చేసిన నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన నరేశ్ ఇంటి ఎదురుగా ఉన్న జమాల్‌పూర్ సోనీబాయ్ ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. మృతుడి తల్లి కళమ్మ కుమారుడు నరేశ్‌కు ఫోన్ చేయగా సమాధానం రాలేదు. ఇతరుల సాయంతో మరోసారి ఫోన్ చేసినప్పటికీ ఎత్తలేదు. అనుమానంతో వెంటనే సోనీబాయ్ ఇంటికి వెళ్లి చూడగా విగతజీవిగా నరేశ్ మృతి చెంది కనిపించాడు. నరేశ్ ఇంట్లోకి రాగానే నిందితురాలు సోనీబాయ్ ఆమె కుమారుడు కిశోర్ గొంతునొక్కి చంపిన తర్వాత ఉరి వేశారు. తర్వాత ఉరి నుంచి కిందికి దింపి పడుకొబెట్టి పరారయ్యారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని సీఐ సైదా దర్యాప్తు చేపట్టారు. నిందితులు సోనీబాయ్, కిశోర్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో వారిని శనివారం రిమాండ్‌కు తరలించారు.

వైద్యం అందక మూగజీవి విలవిల

తొగుట, జూన్ 1 : ఆపద సమయంలో వైద్యం అందక మూగజీవి విలవిలలాడింది. సంబంధిత పశువైద్యాధికారి అందుబాటులో లేక రైతులకు ఏమి చేయాలో అర్థంకాక సతమతమవుతున్నారు. శనివారం ఇదే సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. తొగుటకు చెందిన విజయ్‌కుమార్ ఆవు అస్వస్థతకు గురై కిందపడిపోయింది. వెంటనే ఆయన పశువైద్యాధికారి డాక్టర్ నిహారికకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అయినప్పటికీ ఆమె సకాలంలో వచ్చి వైద్యం అందించలేదు.

కార్మికుల పొట్టకొడుతున్న సిమెంట్ కంపెనీలు

గోదాం ఇన్‌చార్జి రమేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సిద్దిపేట కమాన్, జూన్ 1: సిమెంట్ కంపెనీల యజమానులు హమాలీ కార్మికుల పొట్ట కొడుతున్నారని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు హమాలీ కార్మికులతో కలిసి శనివారం ఆయన సిమెంట్ గోదాం ఇన్‌చార్జి రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో సిమెంట్ దిగుమతి చేస్తూ దాదాపు 250 మంది కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పాత విధానాన్ని అమలు చేయాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లేశం, చంద్రం, భిక్షపతి, ఐలయ్య, మురళి, శ్రీను, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

వెద సాగుతో అధిక లాభాలు

రైతుకు వరి విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

మర్కూక్, జూన్1: వెద సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ములుగు సహాయ వ్యవసాయ సంచాలకుడు అనీల్‌కుమార్ అన్నారు. శనివారం మర్కూక్ రైతు వేదికలో వరి వెదసాగు, అధిక సాంద్రత పద్ధతి ద్వారా పత్తిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, డా.పల్లవి మాట్లాడుతూ ప్రస్తుతం కూలీల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. రోజురోజుకు పెట్టుబడులు పెరిగి చిన్నసన్న కారు రైతులు నష్టపోతున్నారన్నారు. వరిసాగులో వెదజల్లే పద్ధతి వైపు రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏవో నాగేంద్రారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

సిద్దిపేట అర్బన్, జూన్ 1: నేడు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ మను చౌదరి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబ